సాక్షి ప్రకాశం

గురువారం | 29 | జూన్ | 2023



త్యాగానికి ప్రతీక బక్రీద్

ఇస్లాంలో రంజాన్‌కు ఎంతటి ప్రాధాన్యం ఉందో బక్రీద్‌కూ అంతే ప్రాధాన్యం ఉంది. గురువారం ఈ పండగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోనున్నారు. - 8లో..



రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్ ధృవతార

రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్ ఒక ధృవతార అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. ఒంగోలు ఎన్‌ఎస్‌పీ అతిథి గృహంలో ఆయన మీడియాతో మాట్లాడారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
38.2 /30

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

9 మంది చిన్నారుల దత్తత



దత్తత ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుపుతున్న శిశు గృహాలోని తొమ్మిది మంది చిన్నారులను వివిధ రాష్ట్రాలకు చెందిన వారికి దత్తత ఇచ్చారు. ప్రకాశం భవనంలో కలెక్టర్ దినేష్‌కుమార్ బుధవారం ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. దత్తత తీసుకున్న తల్లిదండ్రులందరూ దేశంలోని తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వారు. దత్తత తీసుకున్న వాళ్లు ప్రభుత్వ, ప్రభుత్వేతర రంగాల్లో స్థిరపడిన వారని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ మాధురి, బాలల సంరక్షణ అధికారి పి.దినేష్‌కుమార్, ఎస్ఏఏ మేనేజర్ రఫాహెరియేట్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై అవగాహన అవసరం

- కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జంతువుల వల్ల సంక్రమించే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అవగాహన కల్పించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. ప్రకాశంభవనంలో బుధవారం సంబంధిత అధికారులతో జునోసిస్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పెంపుడు కుక్కలతో పాటు రోడ్లపై సంచరించే కుక్కలు పెరిగాయని ఈ నేపథ్యంలో రేబిస్ వ్యాధిపై ప్రజలను అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆరోగ్య సంస్థల్లో విధిగా ఏఆర్‌వీ, వ్యాక్సిన్‌లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. జంతువుల వల్ల సంక్రమించే వ్యాధులపై కరపత్రాలు, పోస్టర్‌లు రూపొందించి అవగాహన కార్యక్రమాలు చేయాలన్నారు. జిల్లాలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసి సేవలందించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి, డీసీహెచ్ఎస్ శ్రీరామమూర్తి, జీజీహెచ్ సూపరింటెండెంట్ భగవాన్ నాయక్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సుధాకర్‌బాబు, పశు సంవర్ధక శాఖ అధికారి నాగార్జున, డీఎఫ్ఓ మోహనరావు, ఔషధ నియంత్రణ అధికారి జ్యోతి, మలేరియా అధికారి జ్ఞానశ్రీ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు జూలై 15వ తేదీ లోగా హెచ్‌టీటీపీ://నేషనల్‌అవార్డ్స్‌టుటీచర్.ఎడ్యుకేషన్.జీఓవి.ఇన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు కాపీ, రెండు సెట్ల ప్రతిపాదనలు వర్డ్ డాక్యుమెంట్ సీడీని 30 పేజీలకు మించకుండా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయానికి పంపాలని ఎంఈఓ, ఉప విద్యాశాఖ అధికారులను డీఈవో ఆదేశించారు.

బక్రీద్, తొలి ఏకాదశి సంతోషంగా జరుపుకోవాలి

ఒంగోలు: జిల్లా ప్రజలు బక్రీద్, తొలి ఏకాదశి పండుగలను సంతోషంగా జరుపుకోవాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే, బాలినేని శ్రీనివాసరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, మాజీమంత్రి శిద్దా రాఘవరావులు వేర్వేరు ప్రకటనల్లో ఆకాంక్షించారు.

రేపు ఒలంపిక్ రన్

ఒంగోలు: ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 30న స్థానిక ప్రకాశం భవనం వద్ద ఒలంపిక్ రన్‌ను ప్రారంభించనున్నట్లు ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుర్రాభాస్కరరావు, కార్యదర్శి బొడ్డు సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం భవనం వద్ద కార్యక్రమాన్ని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ జెండా ఊపి ప్రారంభిస్తారని, మినీ స్టేడియంలో ర్యాలీ ముగుస్తుందన్నారు. తొలుత ఈ కార్యక్రమాన్ని ఈనెల 23న ప్రారంభించాలనుకున్నా వర్షాల నేపథ్యంలో 30వ తేదీకి వాయిదా వేశామన్నారు.



సమావేశంలో పాల్గొన్న మంత్రులు మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్‌కుమార్

జిల్లా ప్రగతికి సమష్టి కృషి

- పారదర్శక పాలనే లక్ష్యం
- సమస్యల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి
- జెడ్పీ సమావేశంలో చర్చించిన ప్రతి అంశంపైనా ప్రత్యేక చర్యలు
- మైనింగ్ ఆరోపణలపై రెండు రోజుల్లో ప్రత్యేక సమావేశం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున
- ప్రభుత్వ స్థలాల రక్షణకు సమగ్ర సర్వే: మంత్రి సురేష్
- విద్యుత్ శాఖ అధికారుల తీరుపై సమావేశంలో ఆగ్రహం

ఒంగోలు:

సమావేశంలో చర్చించిన అన్ని అంశాలను పరిగణలోనికి తీసుకుంటామని, అందరం సమష్టిగా కృషి చేసి జిల్లాను ప్రగతి పథంలో తీసుకువెళ్దామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున పిలుపునిచ్చారు. పారదర్శక పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకు జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఇతర గౌరవసభ్యుల సహాయ సహకారాలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశమందిరంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత శాఖల వారీగా సమీక్షను జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ప్రారంభించారు. విద్యాశాఖ, విద్యుత్, గృహ నిర్మాణశాఖ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, గ్రామీణ నీటిసరఫరా శాఖలపై సమీక్షించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు విద్యుత్‌శాఖ అధికారుల తీరుపై ఆగ్రహించారు. విద్యుత్‌శాఖ అధికారులు ప్రతి సమావేశంలోనూ ఒకే సమాధానం చెప్పడమేంటని నిలదీశారు. అవసరమైన వారికి విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తుంటే అధికారుల నిర్లక్ష్యం కారణంగా పల్లెల్లో వీధి దీపాలు 24 గంటలు వెలుగుతూ పంచాయతీలకు భారీగా బిల్లు వస్తున్నాయంటూ మండిపడ్డారు. నడిరోడ్డులో తప్పుపట్టిన ఇనుపపోల్స్‌ను సైతం మార్చే విషయంలో కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించడమేంటని ప్రశ్నించారు. ఒక వైపు అవినీతికి పాల్పడి సస్పెండైన ఉద్యోగిని తిరిగి అదే డివిజన్‌లో ఎలా వేస్తారంటూ నిలదీశారు. దీంతో ఎట్టకేలకు అధికారులు మరో డివిజన్‌కు మారుస్తామంటూ సమాధానం ఇచ్చారు. విద్యాశాఖలో పాఠశాలలకు ప్రజాప్రతినిధులను ఆహ్వానించడం మానివేశారని, దీనివల్ల పాఠశాలల స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నా పరిరక్షించలేని పరిస్థితులు నెలకొన్నాయని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకొల్లు, పర్చూరు జెడ్పీటీసీలు భవనం శ్రీలక్ష్మి, ఆసోది భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అక్రమ మైనింగ్‌ను నిలుపుదల చేయాలని ప్రశ్నించగా వాటిపై ప్రత్యేక సమావేశాన్ని రెండురోజుల్లో నిర్వహించి వాస్తవ పరిస్థితిని తెలియజేయాలని బాపట్ల జేసీని.. జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సర్వసభ్య సమావేశంలో అత్యంత పారదర్శకమైన అంశాలు చర్చకు వచ్చాయని, వీటన్నింటినీ పరిగణనలోనికి తీసుకుంటామన్నారు. ప్రభుత్వం జవాబుదారీతనంగా వ్యవహరిస్తుందన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ ఆలోచనలకు అనుగుణంగా అందరం సమష్టిగా జిల్లాను ప్రగతిపథంలోకి తీసుకువెళ్లేందుకు కృషిచేద్దామని పిలుపునిచ్చారు.

కొన్ని శాఖలకు సంబంధించి కొంత సమన్వయ లోపం కనిపిస్తోందన్నారు. సమస్య వచ్చినప్పుడు సంబంధిత అధికారులు దానిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలి తప్ప ఒకరిపై మరొకరు చెప్పుకోవడం సరికాదన్నారు. సమావేశంలో మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, ప్రకాశం జెడ్పీ సీఈఓ బి.జాలిరెడ్డి, నెల్లూరు జెడ్పీ సీఈఓ బి.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక సాఫ్ట్‌వేర్ అవసరం



పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు అన్యాక్రాంతం కాకుండా ఉండేందుకు ప్రత్యేకమైన సాఫ్ట్‌వేర్ అవసరం. దాతలు ఇచ్చిన స్థలాలు, ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు సమగ్ర సర్వే అవసరం. ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌కు టెండర్ పిలిచి పూర్తిస్థాయిలో పాఠశాలల స్థలాలను డిజిటలైజేషన్ చేసేందుకు జెడ్పీ అధికారులు చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ ఆదిమూలపు సురేష్, రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి

జిల్లా అభివృద్ధే ధ్యేయంగా కృషి



జిల్లా అభివృద్ధే ధ్యేయంగా అందరం కృషి చేద్దాం. అందరం కలిసి ముందుకు వెళ్లాలని నిర్ణయించామని, అందులో భాగంగా ఇటీవల టెలీ కాన్ఫరెన్స్ కూడా నిర్వహించామన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు మరింత వేగవంతం అయ్యేందుకు సభ్యుల సహకారానికి కృతజ్ఞతలు. ఇదే పరిస్థితి ముమ్ముందు కొనసాగాలి.

– బూచేపల్లి వెంకాయమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్

మరోమారు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు



ప్రోటోకాల్ విషయంలో పదే పదే చెప్పడం సాధ్యపడదు. గత సమావేశాల్లో స్పష్టంగా చెప్పినా మళ్లీ పునరావృతమవుతోంది. మళ్లీ ఈ ఆరోపణలు వస్తే రాతపూర్వక ఫిర్యాదు తీసుకుని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాం. విద్యార్థుల నిష్పత్తికి తగ్గట్లుగా ఉపాధ్యాయుల సంఖ్యకు సంబంధించి అధికారులతో సమీక్షిస్తాం. గృహ నిర్మాణ శాఖ కూడా నిర్ణీత లక్ష్యాన్ని చేరుకునేందుకు జెడ్పీటీసీ, ఎంపీపీలు సంపూర్ణ సహకారం అందించాలి. సెప్టెంబర్ నెలాఖరు కల్లా రైతుభరోసా కేంద్రాలు, సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణం పూర్తి కావాలి. ఇందుకు ప్రతి ఒక్కరి సహకారాన్ని కోరుతున్నాం.

– ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్

పూర్తి వివరాలు అందించాలి



పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థుల నిష్పత్తికి సంబంధించి పూర్తి వివరాలను విద్యాశాఖ అధికారులు అందజేయాలి. విద్యారంగ అభివృద్ధికి మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు ప్రభుత్వ అధిక ప్రాధాన్యం ఇస్తుంది. ఈ నేపథ్యంలో అందుకు అవసరమైన ప్రణాళికలు ప్రారంభం నుంచి ఉండాలి.

– పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్సీ



హాజరైన ప్రజాప్రతినిధులు

ఏఈలు లేరంటే ఎలా



విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. ఎప్పుడు చూసినా ఏఈలు లేరంటూ సమాధానాలు చెబుతున్నారు. 33 మంది ఏఈలు ఉంటే వారితో ఉమ్మడి సమావేశం ఏర్పాటు చేయమని ఎన్నాళ్లు కోరినా సమాధానం ఉండడం లేదు. జెడ్పీటీసీలు, ఎంపీపీలు సమస్యపై ఫోన్‌చేసినా స్పందించకపోవడం సరికాదు. గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్, చీమకుర్తి గ్రానైట్ క్వారీల వద్ద ఏఈల సమస్య వేధిస్తుంది. ఏఈల చర్యల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది. నడిబజారులో ఉన్న పోల్స్‌ను మార్చమని కోరుతున్నా ఏఈలు లేరంటూ సమాధానం చెప్పడం సరికాదు.

– టీజేఆర్ సుధాకర్‌బాబు, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే

ఇంత బాధ్యతారాహిత్యంగా సమాధానం ఇవ్వడమేంటి



సర్వసభ్య సమావేశం ప్రగతి నివేదిక అంటూ ఇచ్చిన పుస్తకంలో తమ నియోజకవర్గ ప్రస్తావనే లేకుండా విద్యుత్‌శాఖ అధికారులు సమాచారం ఇవ్వడం పూర్తిగా బాధ్యతారాహిత్యమే. కండక్టర్ స్థానంలో కేబుల్ వేశారు. ఇప్పుడు అది పనిచేయడం లేదని కండక్టర్ మారుస్తామన్నారు. ఆరు నెలల కిందట సమాచారం ఇస్తే ఇప్పటివరకు మార్చిన దాఖలాలు లేవు. ఎందుకు ఇలా చేస్తున్నారు. మరో వైపు పాఠశాలలకు ప్రహరీల నిర్మాణం కారణంగా ఆక్రమణదారునికి అనుభవ హక్కును ఇచ్చినట్లుగా మారిందని, కనుక తక్షణమే ప్రభుత్వ ఆస్తులను రికార్డు చేయాలి.

– మానుగుంట మహీధర్‌రెడ్డి, కందుకూరు ఎమ్మెల్యే

విద్యా సంవత్సరం ప్రారంభమైనా చర్యలు ఎక్కడ



కొమరోలు మండలం నల్లగుంట్లలో ఎయిడెడ్ యాజమాన్యం నిర్వహణ బాధ్యతల నుంచి తప్పుకుంది. కానీ విద్యాశాఖాధికారులు ఎటువంటి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోలేదు. అక్కడ పిల్లల పరిస్థితి..? ప్రతిపాదనలు పంపామని డీఈఓ సమాధానం ఇవ్వగా..కావాల్సింది ప్రతిపాదనలు కాదని ఉన్నతాధికారుల దృష్టికి సత్వర అవసరాన్ని తెలియజేసి పరిష్కారాన్ని పొందాలని స్పష్టం చేశారు.

– అన్నా రాంబాబు, గిద్దలూరు శాసనసభ్యులు

నిర్మాణాలు వేగవంతం చేయాలి



సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం అత్యధిక నిధులు కేటాయిస్తోంది. ఈ నేపథ్యంలో సీఎం సూచించినట్లుగా ఇనుప విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలి. కండక్టర్ల మార్పుకు వెంటనే చర్యలు తీసుకోవాలి

– కరణం బలరామకృష్ణమూర్తి, చీరాల ఎమ్మెల్యే

నిబంధనలు ఎందుకు అమలు చేయరు



ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే 48 గంటల్లో మార్చాలి. కానీ నెలలు గడుస్తున్నా పట్టించుకోవడం లేదు. విద్యుత్ లైన్లు కిందకు వేలాడుతున్నాయని ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. ఏదైనా జరిగి ప్రమాదం సంభవిస్తే నష్టపరిహారానికి తాత్సారం చేస్తున్నారు. ఇది సరికాదు. తక్షణమే రైతులకు సమస్యలు లేకుండా కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలి.

– బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జెడ్పీ ప్రత్యేక ఆహ్వానితులు

కరెంటుతో..జర జాగ్రత్త..!

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి..కరెంట్ షాక్‌తో ప్రాణాలు కోల్పోయిన మూగజీవాలు.. ఇలాంటి ఘటనలు నిత్యం వింటూనే ఉంటాం. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా క్షణాల్లో ప్రాణాలు గాల్లో కలిసిపోతాయి. విద్యుత్ ప్రమాదాల నియంత్రణ, నష్టాలు తగ్గించేందుకు విద్యుత్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ 26 మంది మృత్యువాత పడగా, 35కు పైగా మూగజీవాలు ప్రాణాలు పోయాయి. రానున్నది వర్షాకాలం.. ఎక్కువ ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో వినియోగదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యుత్ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.



- ఈ ఏడాది నాలుగు నెలల్లోనే విద్యుత్ ప్రమాదాల్లో 26 మంది మృత్యువాత
- విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు
- వ్యాపార సంస్థలు, పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు
- జూలై 2వ తేదీ వరకూ విద్యుత్ భద్రతా వారోత్సవాలు
- టోల్ ఫ్రీ నంబర్: 1912

ఒంగోలు సబర్బన్: విద్యుత్ వినియోగం మానవ జీవితంలో అంతర్భాగమైంది. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతున్న తరుణంలో విద్యుత్ ఉత్పత్తి, వినియోగం కూడా పరుగులు తీస్తోంది. విద్యుత్ వినియోగంలో ప్రజలు కొన్ని మెళకువలు పాటించాల్సిన అవసరం ఉంది. కొంత మందికి విద్యుత్ వినియోగంలో అవగాహనా లోపం, అశ్రద్ధతో పాటు మేలు రకమైన విద్యుత్ ఉపకరణాలు వినియోగించకపోవడంతో తరుచూ విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయి. భారీ వర్షాలు, ఈదురుగాలులకు విద్యుత్ లైన్లు తెగిపోవటం, ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోతుంటాయి. అలాంటి పరిస్థితుల్లో నివాస ప్రాంతాలు, పొలాల్లో విద్యుత్ లైన్లు తెగిపడినప్పుడు ప్రజలు అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది. విద్యుత్ ప్రమాదాల నివారణలో భాగంగా జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలను ఏపీసీపీడీసీఎల్ విజిలెన్స్ అండ్ విద్యుత్ చౌర్య నిరోధక స్క్వాడ్(వీఅండ్ ఏపీటీఎస్) ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. జూలై 2వ తేదీ వరకు అన్ని రంగాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

గృహ వినియోగదారులు పాటించాల్సిన ప్రమాణాలు

- ఇళ్లలో కరెంట్‌కు సంబంధించి ఏ పని చేస్తున్నా విధిగా చెప్పులు, చేతి తొడుగులు ధరించాలి.
- ఇంటికి ఎర్తింగ్ ఇచ్చేటప్పుడు కనీసం రెండు ఎర్త్ ఎలక్ట్రోడ్‌లు అమర్చాలి.
- గ్రైండర్, ఏసీ, రిఫ్రిజిరేటర్ల వినియోగ సమయంలో అసాధారణ శబ్దాలు వస్తే వెంటనే నైపుణ్యం కలిగిన వారితో పరిశీలించాలి
- ఒకే ప్లగ్ పాయింట్ నుంచి లూజ్ వైర్లు టెంపరరీగా అనేకరకాల పరికరాలకు కలపకూడదు. ప్లగ్ తీసేటప్పుడు వైరు లాగకుండా ప్లగ్ పట్టుకొని లాగాలి.
- గృహ వినియోగదారులకు విద్యుత్ షాక్ తగలకుండా ఉండేందుకు ఇళ్లల్లో 30 ఎం ఏఎంపీ సామర్థ్యం కలిగిన ఆర్‌సీసీబీ/ఈఎల్‌సీబీలను విద్యుత్ సరఫరా వలయాల్లో చట్ట ప్రకారం విధిగా ఉపయోగించాలి.
- ఇళ్లలో ఏదైనా విద్యుత్ ఉపకరణం సరిగ్గా పనిచేయనప్పుడు, అనుమానం వచ్చినా లేక నిర్ధారించుకున్నా స్వయంగా ఎవరూ మరమ్మతులు చేయకూడదు. ఎలక్ట్రీషియన్ ద్వారానే మరమ్మతులు చేయించుకోవాలి.
- ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తిని రక్షించే సమయంలో, సహాయం అందించే ప్రయత్నంలో బాధితుడిని చేతులతో తాకకుండా ఎండు కర్రలతో విద్యుత్ తీగలను ప్రమాదానికి గురైన వ్యక్తి నుంచి వేరు చేసి సంబంధిత విద్యుత్ శాఖ అధికారికి సమాచారం అందించాలి.

వ్యవసాయదారులు, రైతు కూలీలు

- వ్యవసాయ పంపుసెట్లకు సంబంధించి మోటారు స్టార్టర్లు, స్విచ్‌లు ఉన్న ఇనుప బోర్డులను విధిగా ఎర్తింగ్ చేయించాలి.
- విద్యుత్ షాక్ తగలకుండా ఉండేందుకు 30ఎంఏ సామర్థ్యం కలిగిన ఆర్‌సీసీబీని మాత్రమే ఉపయోగించాల్సి ఉంది.
- తడి చేతులతో కానీ, నీటిలో నిలబడి కానీ విద్యుత్ మోటార్లను, స్విచ్‌లను, సంబంధిత పరికరాలను తాకరాదు.
- పొలాల్లో తెగిపడిన, జారి పడిన తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లకు దూరంగా ఉండి సంబంధిత విద్యుత్ సిబ్బందికి కానీ, గ్రామ సచివాలయాల్లో ఉన్న ఎనర్జీ సెక్రటరీకి కానీ సమాచారం అందించాలి. ఫిర్యాదు చేసేందుకు టోల్ ఫ్రీ నంబర్ - 1912 అయినా ఫోన్ చేయాలి.
- పంట పొలాల్లో పంటను జంతువుల బారి నుంచి రక్షించేందుకు ఏర్పరచిన ఫెన్సింగ్‌లకు విద్యుత్ సరఫరా చేయరాదు.

వాణిజ్య సముదాయాలు, పరిశ్రమలకు..

- కాటన్ మిల్లుల నిర్వాహకులు ఫ్యానల్ బోర్డు మీద ఉన్న మోటార్లలోకి కాటన్ డస్ట్ లోనికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- లూజ్ ఎర్త్ కనెక్షన్లు, లూజ్ వైరింగ్ లేకుండా పర్మినెంట్‌గా ఉండేటట్లు జాగ్రత్త వహించాలి.
- ట్రాన్స్‌ఫార్మర్ యార్డు చుట్టూ కంచె ఎర్తింగ్ ఏర్పాటు చేసి గేటుకు తాళం వేయాలి.
- స్విచ్ బోర్డులు చెక్క బోర్డు మీద బిగించరాదు. దానికి బదులుగా ఇండస్ట్రియల్ ప్యానెల్ బోర్డు ఉపయోగించాలి.
- లైటింగ్, పవర్ పాకెట్లు, ఎర్త్ వైర్లకు ప్రమాణాలు కలిగిన(ఐఎస్ఐ)ఎఫ్ఆర్ఎల్ఎస్ వైర్లు ఉపయోగించాలి.
- మోటార్లకు విడిగా ఎర్తింగ్ కనెక్షన్లు ఇవ్వాలి.
- ఇండస్ట్రీ పరిసరాల్లో తాత్కాలిక వైరింగ్ తొలగించి శాశ్వతమైన పీవీసీ పైపుల ద్వారా ఏర్పాటు చేయాలి.

ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలో విద్యుత్ ప్రమాదాలకు కారణాలను ప్రజలకు వివరిస్తున్నాం. జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాం. విద్యుత్ ప్రమాదాలు సంభవించే కారణాలను విపులీకరిస్తున్నాం. 80 వేల కరపత్రాలను జిల్లా వ్యాప్తంగా విద్యుత్ వినియోగదారులతో పాటు ప్రజలకు కూడా పంపిణీ చేసి అప్రమత్తం చేస్తున్నాం.

– టీఎక్స్ అజయ్ కుమార్, విద్యుత్ విజిలెన్స్ అండ్ ఏపీటీఎస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్



విద్యార్థుల తల్లులకు అమ్మఒడి చెక్కు అందజేస్తున్న మంత్రులు, కలెక్టర్

ఉజ్వల భవిష్యత్‌కు అమ్మఒడి

- విద్యా రంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- పేదలు ఉన్నత చదువులు చదవడమే లక్ష్యం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగు నాగార్జున

ఒంగోలు అర్బన్: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు అమ్మఒడి పథకం ఎంతో ఉపకరిస్తుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. నాల్గవ విడత జగనన్న అమ్మఒడి నిధులను విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం కురపాకంలో ప్రారంభించారు. దీనికి అనుసంధానంగా స్పందన భవనంలో రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కె. కనకారావు, నగర మేయర్ గంగాడ సుజాత పాల్గొని లబ్ధిదారులకు బ్యాంకు చెక్కును అందచేశారు. అనంతరం మంత్రి నాగార్జున మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. నాడు-నేడు కింద పాఠశాలల రూపురేఖలు మారడంతో పాటు విద్యార్థులకు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు పేర్కొన్నారు. పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని తెలిపారు. భావితరాల భవిష్యత్‌కు అమ్మఒడి పథకం ఎంతో మేలు చేస్తుందన్నారు. గతంలో ఆర్థిక ఇబ్బందులతో పేద కుటుంబాలు చదువును మధ్యలో నిలిపివేసే పరిస్థితులను అధిగమించి సీఎం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. చదువులతోనే కుటుంబాల్లో వెలుగులు వస్తాయని నమ్మిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. జగనన్న విద్యా కానుక ద్వారా విద్యార్థుల అవసరాలన్నీ తీరుస్తున్నామన్నారు. విద్యా రంగానికి మాత్రమే రూ.95వేల కోట్లు వెచ్చించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని కొనియాడారు. చరిత్రలో జగన్ పేరు సువర్ణ అక్షరాలతో లిఖించబడుతుందన్నారు. మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ విద్య ప్రాముఖ్యతను గుర్తించి కరోనా విపత్కర పరిస్థితుల్లోనూ ఈ పథకాలు ఆగకుండా కొనసాగించిన వ్యక్తి జగన్ అని అన్నారు. ఈ ఒక్క పథకానికే సుమారు రూ.26వేల కోట్లు ప్రభుత్వం వెచ్చిస్తుందన్నారు. అర్హత ఉండి లబ్ధి పొందని వారు బాధపడాల్సిన అవసరం లేదని, ఏడాదికి రెండు సార్లు జూన్, జులై, డిసెంబర్-జనవరి నెలల్లో నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. జగనన్న విద్యా కానుక కిట్లు నాణ్యతను స్వయంగా ముఖ్యమంత్రి పరిశీలించి అందచేయడం విద్యారంగానికి ఆయన ఇస్తున్న ప్రాధాన్యం అర్థమవుతుందన్నారు. కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ అమ్మఒడి పథకం కింద జిల్లాలో 2,03,663 మంది తల్లుల ఖాతాల్లో రూ.305.49 కోట్లు జమ చేస్తున్నట్లు తెలిపారు. ఎంతో మంది తల్లులు కూలీ పనులు చేసుకుంటూ బిడ్డలను ఉన్నత చదువులు చదివించాలనే ఆశ ఉన్నా ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి ఈ నగదు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జిల్లాలో పది, ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు మార్గదర్శిని ద్వారా లక్ష్యాలు తెలియజేస్తున్నామని తెలిపారు. ఎక్కడా లేని విధంగా తెలుగు-ఇంగ్లిష్ భాషల్లో (బైలింగ్వల్)) పాఠ్యపుస్తకాలు మన రాష్ట్రంలోనే ముఖ్యమంత్రి ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఈఓ రమేష్, జెడ్పీ విద్యాధికారి సామా సుబ్బారావు, ఉప విద్యాధికారి అనితారోజ్‌రాణి, ఇతర అధికారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి వీడియో సమావేశంలో పాల్గొన్న మంత్రులు ఇతర అధికారులు

క్లుప్తంగా

బాలికకు వాతలు పెట్టిన మహిళ

గిద్దలూరు రూరల్: బాలికపై ఓ మహిళ పైశాచికంగా దాడికి పాల్పడి చేతికి వాతలు పెట్టింది. ఈ సంఘటన మండలంలోని కెఎస్‌పల్లెలో బుధవారం జరిగింది. అందిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మౌనిక అనే మహిళ కుమార్తెను ఇంటి పక్కనే ఉంటున్న ప్రణీత అనే 11 ఏళ్ల బాలిక ఆటలాడుకుంటూ ముద్దు పెట్టుకుంది. ఇది గమనించి చిన్నారి తల్లి మౌనిక తన కుమార్తెను ముద్దు పెట్టుకుంటావా అంటూ ఆగ్రహంతో ప్రణీతను కట్టేసి మరీ చేతికి వాతలు పెట్టింది. ప్రణీత కేకలు గమనించిన స్థానికులు మౌనిక వద్ద నుంచి బాలికను విడిపించి చికిత్స కోసం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రణీత తల్లిదండ్రులు మౌనికపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విషం తీసుకొని టీచర్ ఆత్మహత్య


కోదాటి ఆదిలక్ష్మి (ఫైల్)

చీమకుర్తి: గుర్తు తెలియని విష పదార్థం తీసుకొని టీచర్‌గా పనిచేస్తున్న కోదాటి ఆదిలక్ష్మి (42) మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చీమకుర్తి పల్లపోతువారి వీధిలోని అడ్డరోడ్డులో మృతురాలు ఆదిలక్ష్మి తల్లిదండ్రుల నివాసంలో ఉంటోంది. 18 సంవత్సరాల క్రితం వివాహం జరిగినా దంపతుల మధ్య వివాదంతో విడాకులు తీసుకొని ఆదిలక్ష్మి తల్లిదండ్రుల ఇంట్లోనే ఉంటోంది. పల్లామల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేస్తోంది. మంగళవారం రాత్రి ఆదిలక్ష్మి, తల్లిదండ్రుల మధ్య వివాదం జరిగింది. మనస్తాపానికి గురైన ఆదిలక్ష్మి గుర్తు తెలియని విష పదార్థం తీసుకొని బుధవారం నోటి వెంట నురుగుతో అస్వస్థతకు గురైంది. వెంటనే చీమకుర్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ ధ్రువీకరించారు. పోస్ట్‌మార్టం రిపోర్ట్ వచ్చిన తర్వాత పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉందని ఎస్‌ఐ రామిరెడ్డి తెలిపారు. మృతురాలి తల్లి యోగేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రామిరెడ్డి కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

బార్లకుంటలో పూరిల్లు దగ్ధం

● రూ.1.50 లక్షల నగదు, పది తులాల బంగారం బూడిద


కాలిపోతున్న పూరిల్లు

బేస్తవారిపేట: మండలంలోని బార్లకుంటలో ఓ పూరిల్లు దగ్ధమైంది. మంగళవారం అర్ధరాత్రి సమయంలో బిల్లా వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులు ఇంటి బయట నిద్రపోతున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌లో పూరింటికి నిప్పు అంటుకుంది. చుట్టుపక్కల గృహస్తులు సంఘటనను గమనించి నిద్రపోతున్న వెంకటేశ్వర్లుకు సమాచారం అందించారు. అప్పటికే పూరింటికి పూర్తి స్థాయిలో మంటలు వ్యాపించాయి. కుమార్తె వివాహం కోసం గృహంలోని బీరువాలో దాచి పెట్టిన రూ.1.50 లక్షల నగదు, రూ.పది తులాల బంగారం అగ్నికి ఆహుతైంది. పూరిపాకలో గ్యాస్ సిలిండర్ ఉండటంతో ఇంట్లోకి వెళ్లేందుకు ఎవరూ ప్రయత్నం చేయలేదు. గ్యాస్ సిలిండర్ పేలడంతో బీరువా కరిగి ముద్దయింది. సమాచారం అందుకున్న కంభం అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

● నేడు ఈద్–ఉల్–జుహా


ముస్తాబైన కనిగిరి ఈద్గా

కనిగిరి రూరల్/కంభం: ముస్లింలు జరుపుకునే అత్యంత ముఖ్య పండగల్లో రంజాన్ తర్వాత బక్రీద్. దీనినే ఈదుల్ అజహా, ఈదుజ్జుహా అని కూడా పిలుస్తారు. ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం 12వ నెల జిల్ హిజ్ 10వ తేదీన బక్రీద్‌ను ముస్లింలు నిర్వహించుకుంటారు. ఇస్లాంలోని ఐదు ప్రధాన సూత్రాల్లో ఒకటైన హజ్ తీర్థ యాత్రను కూడా ముస్లింలు ఈ నెల ప్రారంభంలోనే భక్తి, నియమ నిష్టలతో చేస్తారు. సృష్టి ఎంతో అద్భుతమైంది. ఎంత పరిశీలించినా.. పరిశోధించినా అర్థం కానిది. అధ్యయనం చేయాల్సింది ఇంకా ఉందనిపిస్తోంది. మానవుని ఆలోచన పరిధికి మించి ఈ సృష్టిని నియంత్రించే శక్తి ఒకటి ఉంటుందని ఆ శక్తి అల్లాహ్ (దైవం) అంటామని, ఆయన ప్రసాదించిన ఈ జీవితాన్ని ఆయన కోసం త్యాగం చేసేందుకు వెనుకాడకూడదని సందేశాన్నిచ్చే పండగ బక్రీద్. ప్రవక్త ఇబ్రహీం త్యాగనిరతి, సహశీలత, రుజు వర్తనలను తెలుపుతుంది. మానవాళికి మార్గదర్శకత్వం వహించేందుకు దైవం పక్షాన అవతరించిన ప్రవక్తల్లో ఇబ్రహీం ఒకరు. ఐదు వేల సంవత్సరాల క్రితం జన్మించిన ఆయన ×దేవుడే సకల చరాచర సృష్టి కారకుడని, ఆయన పట్ల భక్తిశ్రద్ధలు ప్రకటించడం ద్వారా ముక్తిని పొందొచ్చని జాతికి పిలుపునిచ్చారు.

బక్రీద్..ఇందుకు చేస్తారు

ఈదుల్ జుహా అనేది మనిషి త్యాగ నిరతిని చాటి చెప్పే పండగ. బక్రీద్ ఎందుకు జరుపుకుంటారంటే హజ్రత్ ఇబ్రహీం (సో. అ.స) వారు నిద్రిస్తున్న సమయంలో ఆయన కలలో అల్లాహ్ కన్పించి నీకు అత్యంత ప్రాణమైన నీ కుమారుడిని నాకు (అల్లాహ్ మార్గంలో) ఖుర్బాని ఇవ్వమని కోరతారు. నిద్ర నుంచి మేల్కొన్న ఇబ్రహీం (సో. అ. స) ఆ విషయాన్ని తన కుమారుడు ఇస్మాయిల్‌కు చెప్తారు. దైవ భక్తుడైన ఇస్మాయిల్ తాను దైవానుసారం, దేవాజ్ఞకు అమలు పరిచేందుకు సిద్ధంగా ఉన్నానని అంగీకారం తెలుపుతారు. అల్లాహ్ ఆదేశాను సారంగా ఇబ్రహీం(సో.అ.స) తన ఏకైక పుత్రుడైన ఇస్మాయిల్‌ను ఖుర్బానీ ఇచ్చేందుకు సిద్ధమవుతాడు. ఈ క్రమంలో దైవాజ్ఞ ప్రకారం ఇస్మాయిల్‌ను ఖుర్బానీ ఇచ్చేందుకు తండ్రి ఇబ్రహీం అంతా సిద్ధం చేస్తాడు. కుమారుడిని ఖుర్బానీ ఇచ్చే క్రమంలో తల్వార్‌ను కుమారుని గొంతుపై నడుపుతారు. ఆ సమయంలో అల్లాహ్ (దేవుడు) ఇబ్రహీం త్యాగనిరతిని ప్రశంసిస్తూ, సంతోషిస్తూ.. ఒక్క సారిగా ఇస్మాయిల్‌ను పడుకోబెట్టిన ప్రదేశం (ఖుర్బానీ స్థానంలో)లో ఒక గొర్రెను ప్రత్యక్షం చేస్తాడు. గొర్రె ఖుర్బాని అవుతుంది. దీనికి ప్రతీకగా ముస్లింలు బక్రీద్ పండగను నిర్వహించుకుంటారు. పండగ సందర్భంగా ఆర్థిక స్థితి మంతులు, ధనవంతులు పొట్టేలు మాంసాన్ని ఖుర్బాని పేరుతో పేదలకు పంచుతారు.

ఖుర్బానీ

ఇస్లాంలో రంజాన్‌కు ఎంతటి ప్రాధాన్యం ఉందో బక్రీద్‌కూ అంతే ప్రాధాన్యం ఉంది. గురువారం ఈ పండగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోనున్నారు. ఆర్థికంగా ఇబ్బందులు లేని ప్రతి వ్యక్తి ఖుర్బానీ ఇవ్వడం ఈ పండగ సంప్రదాయం. ఖుర్బానీ ద్వారా వచ్చిన మాంసాన్ని మూడు భాగాలుగా చేసి ఒక వంతు పేదలకు, రెండో భాగాన్ని బంధువులకు, మిత్రులకు, మూడో భాగాన్ని తమ కోసం వాడుకుంటారు.


కంభం ఈద్గాలో ముస్లింల ప్రార్థనలు (ఫైల్)

కంభంలో..

ముస్తాబైన ఈద్గామైదానం, మసీదులు : బక్రీద్ పండుగ సందర్భంగా గురువారం నిర్వహించే ప్రార్థనల కోసం ఈద్గామైదానంతో పాటు మసీదులు ముస్తాబయ్యాయి. తమ ఇల్లవద్ద నుండి ర్యాలీగా బయల్దేరి వెళ్ళి ఈద్గా మైదానంలో ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈద్గా వద్దకు వెళ్ళలేని వారి కోసం మసీదుల్లో ప్రార్థనల కోసం ఏర్పాట్లు చేసారు.

కనిగిరిలో..

కనిగిరి పట్టణంలోని బక్రీద్ ఈద్ నమాజ్ గురువారం అలీ మసీద్ (8వ వార్డు)లో ఉదయం 7 గంటలకు బయాన్, 7.30 గంటలకు నమాజ్, ఈద్గా వద్ద (కనిగిరి–పొదిలి రోడ్డులోని ఈద్గా వద్ద) ఉదయం 8 గంటలకు బయాన్ (ధార్మిక ప్రసంగం), ఉదయం 8.30 గంటలకు నమాజ్ జరుగుతుంది. ఛోటీ మసీద్ (ఒంగోలు బస్టాండ్‌లోని మసీద్) ఉదయం 9 గంటలకు బయాన్, 9.30 గంటలకు నమాజ్ జరుగుతుందని మసీద్ కమిటీ తెలిపింది.

ప్రజల సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

● 11 రకాల సమస్యలు వేగంగా పరిష్కారం
● ప్రతి మండలానికి 6 నుంచి 7 కమిటీలు
● జూలై ఒకటి నుంచి సమస్యల పరిష్కారం
● టీడీపీ పల్లెనిద్ర ఒక విఫలయాత్ర
● మాల,మాదిగల మధ్య చిచ్చు పెట్టేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు కుట్ర
● విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

ఒంగోలు: ప్రాథమికంగా ప్రజల కష్టాలు తీర్చేందుకే జగనన్న సురక్ష పథకం ప్రారంభించినట్లు వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, సంతనూతలపాడు శాసనసభ్యుడు టీజేఆర్ సుధాకర్‌బాబు అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టినప్పుడు ప్రజల నుంచి పలు రకాల పత్రాలకు సంబంధించి అత్యధికంగా విజ్ఞప్తులు వచ్చాయన్నారు. వాటిలో కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ, జనన, మరణ ధ్రువీకరణ, కుటుంబ పత్రం, మ్యుటేషన్, మొబైల్ నంబర్‌కు ఆధార్ అనుసంధానం, ఈ–క్రాప్ నమోదు, నూతన రేషన్ కార్డు జారీ, పాత రేషన్ కార్డు నుంచి పలువురు సభ్యులను విడదీసి నూతన కార్డు జారీ చేయడం వంటివి ఉన్నాయన్నారు. వీటికి మూడంచెల విధానం అనుసరిస్తున్నట్లు తెలిపారు. తొలుత వలంటీర్లు, జగనన్న గృహ రథసారథులు, కన్వీనర్లు ఇంటింటికీ తిరుగుతూ సమస్యలు గుర్తిస్తారన్నారు. వారిని సచివాలయాలకు తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. మండలంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో కమిటీలు వేశారని, 6 నుంచి 7 బృందాలుగా ఏర్పడి మండల వ్యాప్తంగా పర్యవేక్షిస్తారన్నారు. జూలై 1 నుంచి శాసనసభ్యులు, ఇన్‌చార్జులు ఇంటింటికీ చేరుకుని వారికి సంబంధించిన పత్రాల పంపిణీ చేపడతారని చెప్పారు. పత్రాలు పొందడం ప్రజల హక్కు అంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. వాస్తవానికి ఒక పత్రం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే వారిని చూసేవారమని, కానీ మనసున్న మనిషి మన సీఎం అధికారులు, ప్రజా ప్రతినిధులను ప్రతి గడప వద్దకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. వాస్తవానికి మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఈ సమావేశం ఏర్పాటు చేయాలని భావించామని, ఆయన అమెరికా వెళ్తున్న కారణంగా తాను సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే టీజేఆర్ స్పష్టం చేశారు.

టీడీపీ పల్లెనిద్ర..ఒక విఫలయాత్ర

టీడీపీ పల్లె నిద్రపై వ్యాఖ్యానిస్తూ అదో విఫలయాత్ర అన్నారు. మద్దిపాడు మండలంలో గ్రోత్‌సెంటర్ వద్ద సెల్ఫీ దిగారని, కానీ దాని బ్యాక్ గ్రౌండులో కనిపించేది వైఎస్సార్ అన్నారు. జయప్రకాష్ నారాయణ హయాంలో గ్రోత్ సెంటర్ ఏర్పడ్డా దాని అభివృద్ధి బీజాలు మాత్రం వైఎస్సార్ హయాంలోనే అని గుర్తు చేశారు. మల్లవరం డ్యామ్‌ను పరిశీలిస్తే దాని పునాది, ప్రారంభోత్సవం రెండూ వైఎస్సార్ హయాంలోనే జరిగాయని, టీడీపీ యాత్రకు ప్రజా స్పందన లేకుండా పోయిందన్నారు. నందిపాడులో నిద్ర ఎంతమంది చేశారో తెలిస్తే దానిని బట్టి ఆ యాత్ర పరిస్థితి ఏమిటో అర్థం అవుతుందన్నారు. ఈ విషయాలు గొట్టిపాటి రవికుమార్‌కు స్పష్టంగా తెలుసని..టీడీపీ యాత్ర ఒక విఫలయాత్రే అన్నారు.

చంద్రబాబుపై ధ్వజం

ఏదో ఒక విధంగా ప్రజలను మభ్యపెట్టే పనిలో భాగంగా మాలలతో ఒకసారి, మాదిగలతో ఒకసారి చంద్రబాబునాయుడు ఎన్‌టీఆర్ భవన్‌లో సమావేశాలు నిర్వహించారని, దీనిని బట్టే మాల మాదిగలను విభజించి పాలించాలనే కుట్రను మరోమారు చంద్రబాబు అమలు చేస్తున్నారంటూ ధ్వజమెత్తారు. అటువంటి చంద్రబాబు పాలనలో దళితులపై దారుణంగా మాట్లాడిన చంద్రబాబునాయుడు, ఆదినారాయణరెడ్డి, చింతమనేని ప్రభాకర్‌లను ఎందుకు రాజీనామా చేయమని నక్కా ఆనంద్, వర్ల రామయ్యలు డిమాండ్ చేయలేదో సమాధానం చెప్పాలన్నారు. సామాజిక న్యాయం అంటూ జరిగితే ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ఎంతమందికి ఏయే పదవులు లభించాయి. టీడీపీ హయాంలో ఎంతమందికి లభించాయనేది బహిరంగ చర్చకు సిద్ధం కావాలని ఎమ్మెల్యే టీజేఆర్ సవాల్ విసిరారు. చంద్రబాబు నాయుడి పంచన గొడ్డు చాకిరీ చేస్తున్న తమ సామాజికవర్గ ప్రతినిధి వర్ల రామయ్యకు ఎందుకు న్యాయం చేయలేకపోయారో చంద్రబాబును నిలదీస్తే బాగుండేదంటూ టీడీపీలో ఉన్న దళిత నాయకులకు సూచించారు. ఆంగ్ల మాధ్యమం, నాడు–నేడు, అమ్మఒడి, రైతు భరోసా పథకాలు వద్దన్నవారికి బుద్ధి చెప్పేలా 2024 ఎన్నికలు ప్రజాక్షేత్రంలో జరగబోతున్నాయని, దానికి నిత్యం తాము సిద్ధమేనని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు పేర్కొన్నారు.

పది స్కూల్ బస్సులపై కేసులు


స్కూల్ బస్సులు తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు

ఒంగోలు: విద్యా సంస్థల బస్సులపై రవాణాశాఖ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. స్థానిక చర్చి సెంటర్‌లో ఈ మేరకు ఎంవీఐలు ఎ.కిరణ్‌ప్రభాకర్, కె.రామచంద్రరావు, జయప్రకాష్‌లు తమ సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. పాఠశాల బస్సు ఫిట్‌నెస్ రికార్డులు, డ్రైవర్ వయసు, డ్రైవర్ లైసెన్స్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల బస్సుల్లో విద్యార్థుల సంఖ్యను లెక్కించారు. గుర్తింపు లేని పాఠశాలల బస్సులు, లైసెన్స్ లేకుండా బస్సులు నడుపుతున్న వారిని, యూనిఫారం ధరించకుండా బస్సులు నడపడం, పరిమితికి మించి పిల్లలను ఎక్కించుకున్న 10 బస్సులకు సంబంధించి రవాణాశాఖ ఉప కమిషనర్ ఆర్.సుశీల ఆదేశాలతో కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల బస్సులు నడిపేటప్పుడు అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. ఫిట్‌నెస్ లేని బస్సులు ఏవైనా ఉంటే వెంటనే ఫిట్‌నెస్ చేయించుకోవాలన్నారు. ఈ నాటి విద్యార్థులే రేపటి పౌరులని, కనుక యాజమాన్యంపై పిల్లల ఉజ్వల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని అన్ని రకాలుగా రక్షిత మార్గాలు చేపట్టాలన్నారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

ఒంగోలు: లైంగిక దాడి యత్నం కేసులో నిందితునికి రెండో అదనపు జిల్లా జడ్జి ఐదేళ్ల జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా కేసు విచారణలో నిందితుడికి శిక్ష పడేందుకు సమర్థంగా విధులు నిర్వహించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ మలికాగర్గ్ అభినందించారు. నాగులుప్పలపాడు మండలానికి చెందిన తూమాటి తిరుమలస్వామి అనే వ్యక్తి అత్యాచార యత్నానికి పాల్పడినట్లు రిపోర్టు రావడం, ఎస్‌ఐ శశికుమార్ కేసు నమోదు చేయగా సీఐ రాంబాబు దర్యాప్తు చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. కోర్టులో అభియోగపత్రం దాఖలు చేయగా రెండో అదనపు జిల్లా జడ్జి సోమశేఖర్ ముందు తగిన సాక్ష్యాధారాలతో నిందితుడు అత్యాచారయత్నం చేయబోయినట్లు కోర్టులో నిరూపణ కావడంతో ఈ నెల 27న నిందితునికి ఐదేళ్ల జైలుశిక్ష , రూ.2 వేల జరిమానా విధించినట్లు ఎస్పీ మలికాగర్గ్ పేర్కొన్నారు. ఈ కేసులో సమర్థంగా ట్రయల్ మానిటరింగ్ చేసి నిందితునికి శిక్షపడేందుకు క్రియాశీలకంగా వ్యవహరించిన సీఐ రాంబాబు, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ యత్తపు కొండారెడ్డి, కోర్టు లైజన్ ఏఎస్‌ఐ లక్ష్మీనారాయణ, సమన్స్ అమలు చేసిన నాగులుప్పలపాడు ఏఎస్‌ఐ కొండయ్యలను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. లైంగిక దాడులు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని, చట్టం నుంచి తప్పించుకునే వీల్లేకుండా కోర్టులో సమర్థ ట్రయల్ మానిటరింగ్ ద్వారా నిందితులకు కఠిన శిక్షలు పడే విధంగా కృషిచేస్తున్నామని ఎస్పీ మలికాగర్గ్ వివరించారు.

రేపు బోయలపల్లెలో రాష్ట్రస్థాయి ఎడ్ల పందేలు

యర్రగొండపాలెం: మండలంలోని బోయలపల్లెలో వెలసిన ఆత్మానంద అవధూత స్వామివారి ఆరాధన మహోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 30వ తేదీన రాష్ట్రస్థాయి పాలపండ్ల ఎడ్ల పందేలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు ప్రథమ బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ.25 వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలు, 4వ బహుమతి రూ.15 వేలు, 5వ బహుమతి రూ.10 వేల ప్రకారం నగదు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. నిబంధనలను అనుసరించి ఎడ్ల పందేల్లో పాల్గొనాలని కోరారు. స్వామి వారి ఆరాధన మహోత్సవాలను పురస్కరించుకొని తొలిఏకాదశి రోజు గురువారం ఉదయం 6 గంటల నుంచి పూజా కార్యక్రమాలు జరుగుతాయని, రెండు రోజుల పాటు జరిగే ఈ మహోత్సవాల సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామని తెలిపారు.

రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్ ఓ ధృవతార

● అంబేడ్కర్ ఆలోచనా విధానాలు అమలు
● సీఎం ఆదేశాలతోనే వేమూరులో మాజీ సీఎం కొణిజేటి రోశయ్య విగ్రహం
● మీడియాతో జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగ నాగార్జున


మీడియాతో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగ నాగార్జున

ఒంగోలు: రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్ ఒక ధృవతార..అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. బుధవారం జిల్లాకు వచ్చిన ఆయన స్థానిక ఎన్‌ఎస్‌పీ అతిథి గృహంలో తనను కలిసిన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో దళితులపై సామూహిక దాడులు, అఘాయిత్యాలు, అమానుషాలు జరిగాయన్నారు. వెలివేతలు కూడా జరిగాయని, అయినా అప్పటి సీఎం చంద్రబాబునాయుడు స్పందించలేదన్నారు. నేడు రాష్ట్రంలో చిన్న చిన్న ఘటనలు తప్ప సామూహిక దాడులు ఎక్కడా జరగలేదని, ఘటనలు జరిగిన సమయంలో సీఎం ఎలా స్పందిస్తున్నారనేది ఆలోచనాపరులు పరిశీలించాలన్నారు. చంద్రబాబు ఈ రాష్ట్రానికి ద్రోహం చేశారని, రాజకీయం ముసుగులో మాలలు, మాదిగల సమావేశాలు పెట్టి తమను తిట్టించే కార్యక్రమం పెట్టాడన్నారు. తిట్టించినంత మాత్రాన జనం మారతారనుకోవడం పొరపాటన్నారు. మనసులో దళితులను అణగదొక్కాలనే ఆలోచన ఉంచుకుని రాజకీయ ముసుగులో చంద్రబాబు ఆడుతున్న నాటకం మాత్రమే అన్నారు. సీఎం ఆదేశాలతో తాము రోశయ్య పార్థీవదేహాన్ని ఏపీకి తీసుకురావాలని యత్నించామని, అయితే కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లో ఉంటున్నందున అక్కడు కార్యక్రమాలు జరుపుతామని కోరడం జరిగిందన్నారు. సీఎం ఆదేశాలతోనే మాజీ ముఖ్యమంత్రి రోశయ్య జన్మించిన వేమూరులో మంచి విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కేసీఆర్ లేదా కేటీఆర్ లాంటి వారు ఎంతమంది ఎన్ని మాట్లాడినా ఆంధ్రప్రదేశ్ భావితరాలకు దిక్కు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. వారాహినో నారాహినో ఎవరికి ఉపయోగం అన్నారు. అధికారంలో ఉన్నది తమ పార్టీ అని, ప్రజా సంక్షేమమే తమ లక్ష్యమన్నారు. దమ్ముంటే చంద్రబాబు అయినా, లేక వారాహి అయినా 175 సీట్లలో తాము ఒంటరిగా పోటీ చేస్తామని, దమ్ముంటే ప్రకటించి ముందుకు రావాలని సవాల్ విసిరారు. కేంద్రం నిధులతోనే రాష్ట్రపాలన అంటూ అమిత్‌షా అన్నా, లేక సోము వీర్రాజు అన్నా ఆ నిధులు ఏ ఒక్కరి సొత్తో కాదన్నారు. కేంద్రం ఇవ్వాల్సిన వాటా కేంద్రం ఇవ్వాల్సిందే అని, అది పాలనలో కేంద్రం బాధ్యతన్నారు. గతంలో చంద్రబాబు రాష్ట్రానికి రావాల్సిన పది వేల కోట్లు తేలేకపోయారని, నేడు 10 వేలు కోట్లు తీసుకురాగలగడం సీఎం వైఎస్ జగన్ బాధ్యతాయుత పాలనకు నిదర్శనమన్నారు. తాను సైతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఓటేయవద్దని తన కుటుంబ సభ్యులకు చెప్పినా వారి ఓట్లు సీఎంకే వేస్తారు తప్ప తనకు పడవన్నారు. అంతలా ఆయన ప్రజా మన్ననను చూరగొన్నాడని, 2024 ఎన్నికల రణరంగానికి సిద్ధం కావాలని ఇన్‌చార్జి మంత్రి కోరారు.